క్లుప్తంగా

మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



బువ్వనపల్లిలో ర్యాలీ చేస్తున్న మానవత సభ్యులు

నిడమర్రు: దేశాల మధ్య యుద్ధాలు జరగకుండా ప్రపంచ శాంతి వర్ధిల్లాలని మండల మానవత శాఖ ఆధ్వర్యంలో గురువారం బువ్వనపల్లి గ్రామంలో ఆ సంస్థ సభ్యులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సభ్యులు సాగిరాజు జానకిరామరాజు మాట్లాడుతూ మానవత సంస్థను 2004 ఆగస్టు 22న ఏర్పాటు చేసిన గుర్తుగా ప్రతి ఏటా ఆగస్టు 15 నుంచి 22 వరకూ రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో మానవత సంస్థ సభ్యులు శాంతి ర్యాలీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సభ్యులు సంకు సత్యకుమార్, కిలారి రవి, మండల అధ్యక్షుడు వన్నెంరెడ్డి పరమేష్, కార్యదర్శి అలుమోలు అంతిర్వేది. సంకు నాగేషు, అల్లుమోలు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పాడైన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ



స్తంభాలను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

దెందులూరు: దెందులూరు యాదవ నగర్‌లో పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో రెండు నూతన స్తంభాలు, తీగలు ఏర్పాటు చేశారు. దెందులూరు లైన్‌మేన్ వీరయ్య, సచివాలయ అసిస్టెంట్ లైన్‌మెన్ శ్రమించి నూతన విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు చేశారు. పనులను విద్యుత్ శాఖ దెందులూరు మండలం అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు పరిశీలించారు.

వృద్ధురాలికి 'చేయూత'



వృద్ధురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న చేయూత బృందం సభ్యులు

పెదవేగి : పెదవేగి మండలంలోని సూర్యారావుపేట గ్రామంలో జెట్టి సత్యవతి(60) ఒంటరి వృద్ధురాలు. ఈమెకు ఈ నెల చేయూత కార్యక్రమం ద్వారా నిత్యావసర సరుకులు, కొబ్బరాకులతో ఉన్న ఇంటికి గోడలు నిర్మించుకోవడానికి చేయూత బృందం సభ్యులు రూ.10,000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో టీం సభ్యులు మేకా లక్ష్మీనారాయణ, పరసా నాగర్జున, మరిదు లక్ష్మణరావు, వీరంకి శ్రీనివాసరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టాలి



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో–1

భీమడోలు: విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని భీమడోలు ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. గుండుగొలనులోని మోడల్ ప్రైమరీ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఫార్మేటిక్ అసెస్‌మెంట్ పరీక్షలు వాటి పుస్తకాలు, వారి మార్కుల వివరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలోని 120 మంది విద్యార్థులకు సిలబస్‌లోని ప్రతి అంశం అర్థమయ్యే రీతిలో బోధన చేసి, వారి అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. హెచ్ఎం పాశం పాండురంగారావు, టీచర్లు ఎం.దీప్తి, గంగాదేవి, సంధ్య పాల్గొన్నారు.

దివ్యాంగుల జీవితాలతో కూటమి చెలగాటం

భీమడోలు: దివ్యాంగుల పింఛన్లను తొలగిస్తూ వారి జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. భీమడోలులో ఆయన గురువారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్రంలోని దివ్యాంగులు పింఛన్లపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం ఏడాది కాలంలో 4 లక్షల పింఛన్లను తొలగించి వారి ఉసురు కట్టుకుందన్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా రీ వెరిఫికేషన్ చేసి ఎన్నో ఏళ్లుగా పింఛన్లు తీసుకుంటున్న వారిని అనర్హుల జాబితాలో చేర్చడం దారుణమన్నారు. గతంలో వైద్యుడు ఇచ్చిన సదరం సర్టిఫికెట్‌లో 70 శాతం వైకల్యం ఉంటే ఆ వైకల్యం లేదని కొందరిని, 40 శాతం కన్నా తక్కువగా వైకల్యం ఉందని సర్టిఫికెట్లు జారీ చేసి వారి కుటుంబాలను రోడ్డున పడేస్తుందన్నారు. దివ్యాంగులు పలు ఇబ్బందులు పడుతున్నారని, వారి పింఛన్లను తొలగించడం దారుణమన్నారు.

టీడీపీ శ్రేణుల దాడులు అమానుషం

- 144 సెక్షన్ పెట్టి అంతమందిని ఎలా అనుమతించారు?
- టీడీపీ శ్రేణుల దాడులు, దౌర్జన్యాలపై వైఎస్సార్‌సీపీ ఆగ్రహం

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తోటల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు గురువారం చేసిన దాడులు, దౌర్జన్యాలు అమానుషమని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఖండించారు. ఓ పక్క పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్ ఉన్నాయని సాక్షాత్తు డీఎస్పీ స్థాయి అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఇతర గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు అబ్బయ్యచౌదరి తోటలోకి ఎలా వచ్చారని పోలీసులు అనుమతి ఇవ్వటం సబబేనా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దెందులూరు నియోజకవర్గంలో ఎవరి పైనా దాడులు, దౌర్జన్యాలు జరిగాయా అని ప్రశ్నించారు. ఈ విధానం సరికాదని ఎల్లవేళలా ఈ ప్రభుత్వమే అధికారంలో ఉండదన్న సంగతి మరవరాదన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకుల అభిప్రాయాలు వారి మాటలలోనే..

అధికారులు జోక్యం చేసుకోవాలి



కూటమి ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి, పొలాలకు రక్షణ లేకపోతే సామాన్య ప్రజలకు ఇంక ఎక్కడ రక్షణ ఉంటుంది. ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన జిల్లా ఎస్పీ, కలెక్టర్ వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

–ముంగర సంజీవ్‌కుమార్, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్

దాడులు, దౌర్జన్యాలు అమానుషం



పదే పదే మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నాలు, తోటల్లో దాడులు, దౌర్జన్యాలు చేయడం అమానుషం. నియోజకవర్గ, జిల్లా ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు. ఇలాంటి చిల్లర పనులు చేస్తే కొఠారు కుటుంబం ప్రతిష్ట తగ్గదు. టీడీపీ శ్రేణులు ఎలాంటి చిల్లర పనులు మానుకోవాలి.

–ముదుగురు సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అధికారులు చర్యలు తీసుకోవాలి



పోలీస్, రెవెన్యూ, ఉన్నతాధికారులు టీడీపీ చేస్తున్న దాడులు, దౌర్జన్యాలు, వంటా వార్పు నిరసనలపై చర్యలు తీసుకోవాలి. అధికారులు ప్రభుత్వానికి తలొగ్గి నాన్చివేత ధోరణి అవలంభిస్తే భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. టీడీపీ శ్రేణులు చేస్తున్న సంఘ వ్యతిరేక చర్యలు దురదృష్టకరం. –డీబీఆర్‌కే చౌదరి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం



మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కుటుంబం, పొలాలపై తరచూ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ శ్రేణులు దాడులు, దౌర్జన్యాలు చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం. మాజీ ఎమ్మెల్యే తోటల్లో బయట గ్రామాల వ్యక్తులకు ఏ హక్కు ఉంది. పోలీసులు ఎలా అనుమతించారు. రాష్ట్ర పెద్దలు, జిల్లా యంత్రాంగం స్పందించాలి.

–పి.విజయ్‌బాబు, జెడ్పీ వైస్ చైర్మన్

ప్రభుత్వం స్పందించాలి



నెలల తరబడి మాజీ ఎమ్మెల్యే ఇంటి ముందు తోటల్లో జరుగుతున్న దాడులు దౌర్జన్యాలపై ప్రభుత్వం స్పందించాలి. బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లో శాంతి సామరస్య వాతావరణాన్ని శాశ్వతంగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలి. అధికారం ఉంటే ఏదైనా చేస్తారా టీడీపీ దుర్మార్గమైన చర్యలు ప్రజలు గమనిస్తున్నారు.

–మండల సరస్వతి, ఏలూరు జెడ్పీటీసీ

టీడీపీ దాడి సిగ్గు చేటు



దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తోటల్లో టీడీపీ శ్రేణులు చేసిన దాడి, దౌర్జన్యం సిగ్గుచేటు. ఇంత దిగజారుడు చర్యలకు పాల్పడుతున్న అధినాయకులు చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతం. ఈ విధానం మంచిది కాదు. పదేపదే ఎందుకు దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారు.

–కత్తుల రవికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి

మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టకొట్టొద్దు



ఎంఈవో గొర్రెల బాలయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీఎం కార్మికులు

గణపవరం: ఏళ్ల తరబడి పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల పొట్టకొట్టే ప్రయత్నాలు విరమించుకోవాలని ఆ పథక కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం మండల సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఎంఈవో కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లి ఎంఈవో బాలయ్యకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట చేస్తూ, ప్రభుత్వ మెనూను కష్ట నష్టాల కోర్చి అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం వేడివేడిగా అందిస్తున్న తమను కాదని దూర ప్రాంతాల నుంచి ఏజెన్సీల ద్వారా భోజనాలు తెప్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం సరికాదని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు నినాదాలు చేశారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి గణపవరం మండలానికి భోజనాలు వాహనాల్లో చేర వేసి విద్యార్థులకు పెట్టడం క్షేమదాయకం కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంటారావు, త్రినాథ్, బి.జయలక్ష్మి, ధనలక్ష్మి, మహాలక్ష్మి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన అంగన్‌వాడీలు



భీమడోలు: డీటీ రంగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు



గణపవరం: పోలీస్ ఐలెండ్ కూడలిలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

- గత ప్రభుత్వ జీవోను వెంటనే అమలు చేయాలి
- లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తాం

భీమడోలు: గత ప్రభుత్వం అంగన్‌వాడీల సంక్షేమం కోసం జారీ చేసిన జీఓను తక్షణమే అమలు చేయాలని కోరుతూ గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది కదం తొక్కారు. భీమడోలు జంక్షన్ నుంచి ర్యాలీగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారంతా నల్లబ్యాడ్జీలను ధరించి నినాదాలు చేస్తూ తహసీల్దార్ ఆఫీసు వద్దకు చేరుకుని ధర్నా చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని, గ్రాడ్యుటీ జీవోను సవరించాలంటూ నినదించారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు వి.స్వర్ణకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తెచ్చిందన్నారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు వి.స్వర్ణకుమారి మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్‌వాడీల సంక్షేమం రీత్యా పలు డిమాండ్ల సాధనకు జీవో జారీ చేసిందని, ఆ జీవోను ప్రతి అంశాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రంగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు, యూనియన్ నేతలు చల్లా మణి, రేవతి, బిందు, మల్లేశ్వరి, అపర్ణ రాధ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ధర్నా

గణపవరం: అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు గణపవరంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ప్రదర్శనగా నినాదాలు చేస్తూ స్థానిక పోలీస్ ఐలెండ్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, గ్రాడ్యుటీ జీవో అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.రామకోటి, బిజయలక్ష్మి, కె.ధనలక్ష్మి, ఎం.మహాలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎంపీడీవోకు వినతి



ఎంపీడీవో రాజ్‌మనోజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫిర్యాదుదారుడు

ఉంగుటూరు: రావులపర్రు గ్రామంలో సమస్యలపై ఎంపీడీవో రాజ్‌మనోజుకు పలువురు గురువారం వినతి పత్రం అందజేశారు. రావులపర్రులో గాది రమణ, యడవల్లి రామకృష్ణ మెట్లు రోడ్డు మీదకు కట్టేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కర్నాటి వెంకన్నబాబు, జలసూత్రం కుమార్ ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా ఒకరు రోడ్డు మీద ఇసుకు, ఇటుకలను ఉంచారని, మరొకరు ప్రహరీ గోడ నిర్మించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజ్‌మనోజును కోరారు. అలాగే ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి చెరువును ఆనుకుని డ్రెయినేజీపై గాది సత్యనారాయణ ఇల్లు నిర్మించడం వలన డ్రెయినేజీ పూడిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పరిశీలించి ఈ సమస్యను పరిష్కరించాలని ఇబ్బా దుర్గారావు ఫిర్యాదు చేశారు. ఇబ్బా నాగేశ్వరరావు పంట బోదెను ఆక్రమించుకోవడంతో నీరు వెళ్లక రోడ్డుపై నిలిచిపోతుందని రావులపర్రుకు చెందిన నక్క కృష్ణమూర్తి ఫిర్యాదు చేశారు.

ప్రతి ఒక్కరూ శాంతిని నెలకొల్పాలి



శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మానవత ప్రతినిధులు

ఉంగుటూరు: మానవత వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శాంతి ర్యాలీ గురువారం నిర్వహించారు. నారాయణపురం గ్రామంలో ఉషోదయ పాఠశాల విద్యార్థులు, మానవత సంస్థ సభ్యులు కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఉత్తమ సమాజం మానవత ధ్యేయమని, ప్రపంచ శాంతిని ప్రతి ఒక్కరూ కోరుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి అన్నారు. ప్లాస్టిక్ నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవత కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.జానకి రామరాజు, మండల అధ్యక్షుడు కోనే వీర వెంకట సత్యనారాయణ, మండలి చైర్మన్ గుణ్ణం బుల్లబ్బాయి, మండల కన్వీనర్ అడపా శ్రీను, కార్యదర్శి రాజాన సతీష్, కోధికారి గంజి రవి, వి.సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా ప్రాణాంతకం



సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుందని, ఈ వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. గురువారం గణపవరం మండలంలో షెడ్యూలు తెగలకు సంబంధించిన 16 కుటుంబాలకు చెందిన 20 మందికి సికిల్ ఎనీమియా రక్త పరీక్షలు నిర్వహించారు. గణపవరం–2 సచివాలయ పరిధిలో ఆరుగురు, గణపవరం–4 సచివాలయం పరిధిలో నలుగురు, వల్లూరులో 14 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో ఉన్న వారికి వస్తుందని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు గణపవరంలో ఉన్న గిరిజన కుటుంబాలకు చెందిన 40 ఏళ్ల లోపు వయస్సు వారికి సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ వ్యాధి సోకిన వారికి ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారం, అర్ధ చంద్రాకారంలోకి మారతాయని, ఈ వ్యాధి వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఓంకార్‌నాథ్, సీహెచ్‌వో జాలాది విల్సన్, పీహెచ్ఎన్ సత్యవతి, హెచ్‌వీ పద్మజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుతో భవిష్యత్ చిత్తు

గణపవరం: విద్యార్థులకు డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఓంకార్‌నాథ్ అన్నారు. గురువారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, డ్రగ్స్ దుష్ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో కేవలం చదువు, కెరీర్‌పైనే దృష్టి సారించాలని, చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 అధికారులు పి.భాస్కరరావు, రాణిదుర్గ అధ్యాపకులు శ్రీనివాసరావు, చైతన్య, వెంకట్రావు, వి.శారదాదేవి, అనూరాధ, జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

శాంతితోనే సమాజాభివృద్ధి



బువ్వనపల్లిలో శాంతి ప్రదర్శన చేస్తున్న మానవత సభ్యులు

నిడమర్రు: శాంతియుత సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందని మానవత సంస్థ జిల్లా అధికార ప్రతినిధి సాగిరాజు జానకి రామరాజు అన్నారు. గురువారం ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా నిడమర్రు మండల మానవత ఆధ్వర్యంలో బువ్వనపల్లిలో శాంతి ప్రదర్శన చేసి, మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా మానవత మండల శాఖ అధ్యక్షుడు వన్నెంరెడ్డి పరమేశ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలు కలసిమెలసి జీవిస్తే ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక మాట్లాడుతూ మానవత సంస్థ శాంతి స్థాపన కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మానవత సభ్యులు కాన్వెంట్ శ్రీను, సంకు శేషు, సంకు సత్యకుమార్, కిలారి రవి, అలుమోలు అరుణ్, తన్నీడి వాసు, గాజుల నాగేశ్వరరావు, గాజుల సత్యనారాయణ, మంత్రబుడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిడమర్రు: నిడమర్రు సెక్షన్ పరిధిలో కొత్త లైన్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ ఎం. అంబేడ్కర్ తెలిపారు. నిడమర్రు, గుణపర్రు, గుణపర్రు, విప్పర్రి కండ్రిక, పెదనింద్రకొలను, పత్తేపురం, తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి, దేవరగోపవరం, అడవికొలను, బువ్వనపల్లి, చానమిల్లి, మందలపర్రు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: ఉంగుటూరు సెక్షన్ నారాయణపురం సబ్‌స్టేషన్ నుంచి నిడమర్రు సబ్ స్టేషన్‌కు ఆర్‌డీఎస్ఎస్‌లో నూతనంగా ఫీడర్‌ను నిర్మించనున్నారు. ఈ పనుల నిమిత్తం ఈ నెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు నారాయణపురం సబ్ స్టేషన్ పరిధిలో బాదంపూడి రూరల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. రాచూరు, రావులపర్రు, సీతారాంపురం గ్రామాలకు, చేపల చెరువులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పెదవేగి ఎంఈఓ–1పై ఫిర్యాదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రామచంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒకే ఒక్క సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ పెదవేగిలో పాఠాలు చెప్పాలని నిబంధనలకు విరుద్ధంగా ఈ నెల 4న మౌఖిక ఆదేశాలతో డిప్యూటేషన్‌పై పంపిన పెదవేగి ఎంఈఓ–1పై చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ 1938 సంఘ నాయకులు గురువారం డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మకు వినతి పత్రం అందజేశారు. ఆ డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరారు. ఐతే ఎంఈఓ–1 బి.త్రిపుర సుందరీ దేవి నిర్భీతిగా తానేమి తప్పు చేయలేదని ఏపీటీఎఫ్ 1938 అల్లరి పాలు చేస్తున్నారని పత్రికా ముఖంగా ఖండించడం శోచనీయమని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధ్యాయులు, అధ్యాపకులతో ఎమ్మెల్సీ గోపీమూర్తి

ఉంగుటూరు: ఉపాధ్యాయులు ,పాఠశాలల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మెల్సీ గోపిమూర్తి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలని పార్మట్ సమ్మేటివ్ పరీక్షలను పాత పద్ధతుల్లోనే నిర్వహించాలని కోరారు. టీచర్స్ ఫారమ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న విజయవాడలో 2003 టీచర్ల ఫోరమ్ ఆధ్వర్యంలో జరగనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా ఆలీ, ఉంగుటూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు పునుముల రాంబాబు, డాకి జోగి నాయుడు, జిల్లా కార్యదర్శులు శ్రీదర్, కమల కుమార్, జిల్లా సభ్యులు నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందచేత

వెల్లమిల్లి పాఠశాల వద్ద జెండా రాడ్‌ను తీసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురై చనిపోయిన పాఠశాల ఆయా భర్త ఉసురుమర్తి భీమరాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ గోపీమూర్తి పరామర్శించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సమకూర్చిన రూ.లక్షా 30 వేల నగదును గోపీమూర్తి ఉసురుమర్తి పుష్పకు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, హెచ్ఎం చలంచర్ల రాణి, ఉపాధ్యాయులు జ్యోతి, వేములపల్లి సుధీర్, ఇమ్మని గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయం



గుంతలో నిలిచిపోయిన లారీ

దెందులూరు: పోతునూరు, ఉండ్రాజవరం మీదుగా జాతీయ రహదారి వైపు ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడా గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ప్రమాదంగా మారాయి. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, స్కూల్ లకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు ఆ మార్గంలో ప్రయాణిస్తున్నప్పుడు తమపై ఎక్కడ పడతాయో అని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల ప్రజలు నిత్యం వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకపోవడం, పాలకులు, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం గమనార్హం.

ఉచిత బస్సు ప్రయాణికులకు తప్పని అవస్థలు



కిక్కిరిసిన బస్సులో ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

భీమడోలు: స్త్రీ శక్తి పథకంలో ఉచిత ప్రయాణానికి సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల సమయం బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సుల్లో రద్దీ ఎక్కువైంది. సాధారణ టిక్కెట్లు తీసుకుని ప్రయాణికులకు సీట్లు దొరక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు గమ్యస్థానాలను చేరుకోవడానికి అవస్థలు పడుతున్నారు. పురుషులు ఎక్కడమే కష్టంగా మారింది. జాతీయ, రాష్ట్రీయ రహదారులకు కూడలిగా ఉన్న భీమడోలు బస్టాండ్‌కు గతంలో కన్నా బస్సు సర్వీసులు తగ్గడంతో ప్రయాణికులు పలు అవస్థలు పడుతున్నారు. తమ గ్రామాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, భక్తులు, ప్రయాణికులు ఆటూ బస్సులు లేక, ఇటు వసతుల్లేని బస్టాండ్‌లో గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ బస్టాండ్ నుంచి సుమారు 50 గ్రామాలకు చెందిన 5 వేల మంది ప్రయాణికులు పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్టాండ్‌కు ప్రతి రోజూ 250 బస్సులకు వస్తుంటాయి. వాటిలో ఎక్కువగా జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు ఇదే ప్రధాన బస్టాండ్. అయితే కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, సాధారణ ఎక్స్‌ప్రెస్‌లకు మాత్రమే ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. దీంతో మహిళలు వీటికే మొగ్గు చూపుతున్నారు. అందుకు తగిన బస్సులు లేకపోవడంతో కుటుంబ సమేతంగా ద్వారకాతిరుమలకు వెళుతున్న భక్తులు, ఉద్యోగులు, విద్యార్థులు నరకయాతను అనుభవిస్తున్నారు. దీనికి తోడు ఈ బస్టాండ్‌కు వచ్చే రెండు బస్సు సర్వీసులను రద్దు చేయడంతో వారి తిప్పలు ఇంతా అంతా కావు. దీనికి తోడు ఉభయగోదావరి జిల్లాల నుంచి వచ్చే బస్సుల్లో కూడా ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో సీట్ల కోసం పలువురు పోటీ పడుతున్నారు. వాస్తవానికి బస్సులో 54 మంది 56 మందికి సీట్లు ఉండగా, 70 మందికిపైగా ఎక్కుతున్నారు. రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలని, సర్వీసులు పెంచి రద్దీని తగ్గించే చర్యలను ఆర్టీసీ అధికారులు తీసుకోవాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.